


# కాలమ్ దాటని కబుర్లు

## బలభద్రపాత్రుని రమణి



### నెల నెలకీ కొన్ని కులాసా కులాసా కబుర్లు

*దీక్షితార్*

**నా బాల్యంలో** స్టాంప్ కలెక్షన్ చేస్తుంటే నా దగ్గరకి ఈ ముత్తుస్వామి దీక్షితార్ స్టాంప్ వచ్చింది. ఈయనెవరని అమ్మని అడిగాను. అమ్మలు అంటే ఎన్సైక్లోపీడియాలని మన ఉద్దేశం కదా! సాధారణంగా అమ్మలు తమకి ఏదీ తెలియదు అని చెప్పరు. దీక్షితార్ అంటే చాలా దీక్షగా సంగీతం నేర్చుకున్నారు అని అలా అంటారు అంది. న్యూటన్ గురించి అడిగితే, బెంగాలీ వాళ్ళు 'నూతన్' అని 'న్యూటన్' అని పలుకుతారు మనవాడే అనీ, 'తాంతియా తోపే' అంటే టోపీలు వూడదీసి ఇంగ్లీషు వాళ్ళని తంతే వెళ్ళిపోయారు కాబట్టి ఆ పేరు వచ్చిందనీ చిన్నప్పుడు అమ్మ చెపితే నమ్మేవాళ్ళం.

నేనూ నా పిల్లల్కి అలాగే తెలిసింది తెలిసినట్టూ తెలియనిదీ తెలిసినట్టే వంశపారంపర్యంగా పెంచుతూ వచ్చాను.

సో.. దీక్షగా చెయ్యాలి ఏ పనైనా అన్న విషయం నా బుర్రలో నాటుకుపోయింది. నాకు పదకొండేళ్ళు వస్తుండగా స్టాంప్స్ కలెక్షన్ చాలా కాస్ట్లీ హాబీ అని అర్ధం అయింది. ఎప్పుడైనా పోస్ట్‌మేన్ దయతలచి ఇస్తే తప్ప స్టాంప్స్ పెట్టి లెటర్స్ రాసే లెవెల్ చుట్టాలు ఎవరూ లేరు. రాజమండ్రి నుండి చిన్నమ్మమ్మా, సిర్‌పూర్ కాగజ్ నగర్ నుండి సరోజని అమ్మమ్మా, నాగ్‌పూర్ నుండి పెద్దమ్మా పది పైసల పోస్ట్ కార్డ్ కొని, దానిపైనా, పక్కనా ఎడ్రెస్ ఏరియాలో కూడా వదిలిపెట్టకుండా చీమలంత అక్షరాలతో దాని పది పైసల ప్రాణానికి పాతికపైసల రాత రాసే వాళ్ళే కానీ స్టాంప్ పెట్టి కవర్‌లో ఉత్తరం రాసే స్టాటస్‌కి ఎదగలేదు.

సందానీగాడు 'బచ్చాలు' ఆడడానికి సిగరెట్ పెట్టెలమీద కవర్‌లు సేకరిస్తూ నా కళ్ళబడ్డాడు. మరీ సిగరెట్ పేకెట్లు సేకరిస్తే, వీపు విమానం మోత మోగిస్తుంది అమ్మమ్మ అని భయపడి మన భారతదేశ కాలమానం ప్రకారం, మన ఆర్ధిక విధానం ఇందిరాగాంధీ పాలనలో, దృష్టిలో పెట్టుకుని, మనుష్యుల పావర్టీ లేన్ వల్ల అగ్గిపెట్టెలేనిదే పొయ్యి రాజుకోదనీ, సామాన్యుడికి భుక్తిలేదనీ యోచించి, దీక్షితార్ స్టాంప్‌కి దణ్ణం పెట్టుకుని, దీక్షగా అగ్గిపెట్టెల మీద బొమ్మలు కలెక్ట్ చేసి, నోట్ బుక్‌లో అంటించడం మొదలు పెట్టాను. నెమలి మార్క్, రామచిలుక, గులాబీ పువ్వు, రైలు, సైకిల్ ఎన్నెన్ని వుండేవో అన్నీ యాదగిరి షాప్‌లో కొనమని గోలపెట్టేదాన్ని. తర్వాతరువాత 'షిప్' వచ్చి అన్నింటినీ మూయించింది. గ్యాస్ సిలిండరూ, లైటరూ వచ్చి మన 'హెరిటేజ్'ని అటక ఎక్కించాయి. ఎంచక్కా సిగరెట్లూ, చుట్టలూ తాగే ధూమపాన ప్రియులు కూడా బడ్డీ కొట్లో నిప్పుతో వేలాడదీసే కొబ్బరినారతాడు చివర్న సిగరెట్ అంటించుకుని పోతున్నారేకానీ ప్యాంట్ జేబుల్లో అగ్గిపెట్టి

పెట్టుకోవటంలేదు. నా దీక్ష ఎంతలా వుండేదంటే, ఏ చెత్తకుండీ దగ్గర చూసినా నేనే. అగ్గిపెట్టెలు ఏరుకుంటూ, ఇంక మద్రాసూ నాగపూరూ లాంటి వేరే రాష్ట్రాలకి వెళ్ళామా పండగే. మరాఠీ అగ్గిపెట్టెలూ, తమిళ అగ్గిపెట్టెలూ, స్నేహితుల ముందు నా స్టాటస్ పెంచేవి. నన్ను చూసి ఇన్‌స్పైర్ అయి ఈ ముష్టి కలెక్షన్ మొదలు పెట్టిన నా ఫ్రెండ్స్ భవానీ, మంజూ, తెల్ల చిట్టీ, క్రరి బుజ్జీ నా కన్నా వెనుక వుండేవారు. ఎందుకంటే, మల్లయ్య శేఠ్, బాలమ్మ పచారీ షాప్‌ల వాళ్ళని అడుక్కుని నేనే ముందు అగ్గిపెట్టెల మీదున్న ప్యాక్ కవర్ తెచ్చేసుకునేదాన్ని.

ఈ అడుక్కోవడంలో నాకన్నా వెనకబడి వున్నవాళ్ళని చూసి నేను విర్రవీగేదాన్ని. అసలు అడుక్కోవడంలో తప్పేవిటి? మంత్రులు ఓట్లూ, కొంతమంది ప్రముఖులు ఫేస్‌బుక్‌లో లైకులూ అడుక్కోవడం నేను చూసాను. నా అగ్గిపెట్టెల కొస్తున్న పబ్లిసిటీ తప్పా? పబ్లిసిటీ కోసం ఎవరెవరు ఏమేం చేస్తారో నాకు ఆ వయసులో తెలీకపోయినా ఇప్పుడు తెలుసు. యూ ట్యూబర్స్ కొంతమంది 'వ్యూస్' కోసం భర్తలతో పోట్లాడడం, విడాకులు సైతం ఇవ్వడం చూస్తున్నాను. పబ్లిసిటీ కోసమే ఏ పనైనా. ఉట్టి పుణ్యాన ఎవరూ చెయ్యరు. ఈ విధంగా జైత్రయాత్ర సాగుతుండగా, నరకాసురుడే బతికుంటే, బాణాసంచా ఫ్యాక్టరీలూ, శివకాశీ క్షేత్రాలూ వుండేవా అన్నట్లు మా అన్నయ్య కంట పడ్డాను. "ఒక్కటంటే ఒక్కటియ్యవా పర్‌కాష్ పిలీజ్ అంటూ సందానీతో కలిసి అగ్గిపెట్టె కవర్లు, ప్రకాష్ కొట్లో అడుక్కుంటుండగా, అదీ వాడి మిత్రబృందంతో వుండగా, అక్కడే వాడి సైకిల్ మీద బరా బరా ఈడ్చి ఎక్కించుకుని నన్ను ఇంటికి తీసుకొచ్చి అగ్గి పెట్టెల కలెక్షన్ పుస్తకానికి నిప్పు పెట్టేసాడు. అహా.. ఇంత అవమానమా? ఇంట్లో ఎవరూ కాపాడలేరా? అని పౌరాణిక సినిమాల ప్రభావంతో జుట్టు విరబోసుకుని, ప్రతి గోడ దగ్గరకీ, అవే స్తంభాలనుకుని, విలపించి, ముక్కు తుడుచుకుని మూల కూర్చుని అమ్మమ్మ చేసిన పులిపొంగడాల వాసన ముక్కులు అదరగొడ్తున్నా అన్నపానాలు మానేసి, సత్యాగ్రహం చేసా.

సందానీ వచ్చాడు "దీక్ష మానకు ఇంకోటి ఏదైనా కలెక్ట్ చెయ్యి పిల్లా" అన్నాడు మందలిస్తూ.

మళ్ళీ స్పిరిట్స్ లేచాయి. వెళ్ళి కార్డ్‌బోర్డ్ మీద అమ్మాయి, అబ్బాయి బొమ్మలు గీసి, కత్తెరతో కత్తిరించి, నా నోట్ బుక్‌ల్లోంచి కాయితాలు కత్తిరించి, గౌన్లూ, బనీన్లూ, ప్యాంటులుగా వాటిని మార్చి, పెన్సిళ్ళతో రంగులూ, బొమ్మలూ బోంబే డయింగ్‌లని తలదన్నేట్లు వేసి బట్టలు తొడిగా. మళ్ళీ దీక్షితార్ నన్ను ఆవహించినట్లు, ఎక్కడ చూసినా నా చేతి కత్తెర పనితనమే. గుట్టలు గుట్టలు కాయితాలు, రంగు రంగుల బట్టలు తొడుక్కున్న నా పిల్లలు, ఇద్దరు నలుగురయ్యారు. లాస్ట్‌కి ఎనిమిది మందయ్యారు. వాళ్ళందరికీ బట్టలు సమకూర్చవలసిన బాధ్యత నాది.

అన్నయ్య బి.కాం ఎకౌంట్స్ రాసుకోడానికి కొనుక్కున్న రిజిస్టర్‌లోంచి పేపర్లు కసిగా దొంగిలించి కత్తిరించి పావడాలు కుట్టేసాను. ఓణీలు కూడా. మరి ఆడపిల్లలకి వయసొచ్చేస్తోందిగా. ఇలా నా మావిడిపిందెల పరికిణీ, తామరపూల గౌనూ, అని అందాల లోకంలో ఈదులాడుతుండగా, ఈసారి అమ్మమ్మకి స్కూల్లో మేరీ టీచర్, సగం పేపర్లు చింపిన నా నోట్ బుక్కులు చూపించింది. అమ్మమ్మ అపరకాళీ అవతారం ఎత్తి, నన్ను వేప బెత్తంతో కొట్టడమే కాకుండా నా నిధులన్నీ బాయిలర్‌లో వేసేసింది. లక్క ఇల్లు కాలపెట్టినప్పుడు కుంతీదేవిలా నేను శోకించి, విలవిలలాడినా ప్రయోజనం లేకుండా పోయింది. హతవిధీ అనుకున్నాను.

ఈలోగా వినోలియా ఓ పోటీ పెట్టింది. చేతికి వేసుకునే మట్టి గాజులు చిట్లితే అవి దీపం మీద పెట్టి ఆ సెగకి అవి ఒంగితే, ఒకదానిలోంచి ఒకటి మాలలా చేసి దండలు చెయ్యడం. అవి మా ఇంటినుండి పక్కలైన్ బుజ్జీ వాళ్ళ ఇంటిదాకా చెయ్యడం. నాకు సహాయకుడుగా సందానీ వుండడానికి వాడికి రోజూ ఐదు పైసలు ఇవ్వడానికి ఒప్పుకున్నాను. మళ్ళీ దీక్షితార్ దీక్ష మొదలు. రంగురంగుల గాజులు ఎవరు ఇల్లు వూడ్చి కసువు పారేస్తారా, చెత్త దిబ్బల మీద అని వెతకడం ఏకాగ్రతతో

దీక్షగా పూలగాజులు, చెమ్కీ గాజులు, తేనె రంగు గాజులు, నీలం, ఎరుపు, ఆకుపచ్చ, ఇలా హారాలు తయారయిపోతూ వుండడం, అమ్మమ్మతో పెన్షన్ ఆఫీస్‌కి చార్మినార్ వెళ్తాననడం, ఆవిడ సాయం వస్తున్నానని మురిసిపోవడం, నేను గాజుల అంగళ్ళ దగ్గర బైఠాయించడం, రమ్మంటే తలాయించడం, కొన్నాళ్ళకి అమ్మ గాజులు తగిలించుకునే స్టాండ్‌లో గాజులు అన్నీ మాయం అవడం, అక్కలవి పగిలి వుండడం ఇలా శృతిమించి రాగాన పడడమే నా దీక్షితార్ దీక్ష అంటే, ఈలోగా సందానీ "వినోలియా గాజుల దండ బుజ్జి వాళ్ళింటి వరకూ వేస్తున్నయ్" అన్న వార్త మోసుకొచ్చాడు. నేనూ నాదండ వీధిలో పరవడం మొదలు పెట్టానో లేదో మా అన్నయ్య ఫ్రెండ్ సుబ్బారావు సైకిల్ నా గాజుల దండ మీద నుండి కర్కశమైన టైర్లతో తొక్కుతూ వచ్చి "మీ అన్నయ్య వున్నాడా?" అన్నాడు.

నేను కోపంగా అరుస్తూ "నా గాజులు పగలకొడ్తావా? ఎంత ధైర్యం?" అని అరిచాను. అతను తెల్లపోయాడు. ఈలోగా అన్నయ్య రావడం, వాళ్ళిద్దరూ కాలేజీకి వెళ్ళిపోవడం జరిగిపోయింది.

నా గాజుల దండ విరిగి పడి రోడ్డుమీదకెక్కి నగుబాటు పాలైంది.

ఇంక ఈ రకమైన దీక్షలు పట్టనే పట్టకూడదనుకున్నాక, కాలేజ్‌కి వెళ్ళగానే పుస్తకాలూ, నవలలూ చదవడం పిచ్చి పట్టింది. ఇంక వంట చేస్తూ పుస్తకం చదవడం, కూర మాడిపోవడం, పెళ్ళయ్యాక, పిల్లాడు పుట్టాక వాడికి పాలిస్తూ పుస్తకం, వాడుక్కిరిబిక్కిరి అవుతున్నా పట్టించుకోకపోవడం, చీవాట్లు తినడం.. ఆ పిచ్చి ఇంకా కంటిన్యూ అవడం మొత్తానికి దీక్షితార్‌గారి దీక్షలు నాకు రాయడం మొదలు పెట్టిన కొత్తల్లో చాలా వుండేది. వారం రోజుల్లో నవల పూర్తి చేసిన రోజులున్నాయి. ఒకే రోజు మూడు కథలు రాసి వివిధ పత్రికలకి పంపేదాన్ని. ఇంక ఎప్పుడయితే టీ.వీ, సినిమాలాంటి మీడియా ఆకర్షించిందో, రోజూ డైలీ సోప్‌లలోపడి, అవి రాస్తూ నా వ్యాపకాలు వెనకపడ్డాయి. డబ్బులు వచ్చేవి కదా, తప్పించుకోలేదు. ఇవి ఎప్పుడయినా రాయచ్చు అని ఆపాను. కానీ ఇప్పుడు రాయడంలో ఆ దీక్ష లేదు. ఎందరో అభిమానించి ఉత్తరాలు రాసినా, కనపడ్డప్పుడో, ఫేస్‌బుక్‌లోనో పొగిడినా, ఆ ఊపూ, ఆ ఉధృతీ, దీక్షితార్ దీక్షా రావడంలేదు. వయసు పైబడ్తున్నా ఇంకా దీక్షగా నవల వెనుక నవల రాస్తున్న రచయితలని చూస్తుంటే నాకు సిగ్గేస్తుంది. కానీ విపరీతమైన సైడ్ ఆకర్షణలు ఓటీటీలనిండా వెబ్ సిరీస్, సినిమాలూ, "జీవితాన్ని 'ఎంజాయ్' చెయ్యమ్మా" అనే నా పిల్లల ప్రబోధాలతో దీక్ష మరుగున పడింది. నెలనెలా ఈ కాలమ్ కూడా మా కాంతిగారి ప్రోద్బలం.. కౌముది ఎడిటర్‌గారి సహకారం. వారికి నా కృతజ్ఞతలు.. నమో వాకాలూ.

Post your comments










https://www.youtube.com/watch?v=ERaaX_IulS4